"నేను యెంతగా ఆ ప్రశ్న అడగాలనుకుంటున్నానో మీకు తెలియదు. అడగలేను, కాని మీరా ప్రశ్నను ఊహించడం యేమంత కష్టం కాదు. ఆ ప్రశ్న యేమిటో తెలిశాక మీ యిష్టం వచ్చిన నిర్ణయం తీసుకోండి."

# అడగని ప్రశ్న -యిచ్చిన జవాబు

కె.వి.యల్.ఎన్. ప్రకాష్

ఎండ మొహంమీద పడటంతో నాకు మెలకువ వచ్చింది. రాత్రి ఆలోచనలతో చాలా ఆలస్యంగా నిద్రపోయాను. దాంతో బద్ధకం అనిపించి అలాగే పడుకున్నాను.

గుమ్మంలో అడుగుల చప్పుడు వినిపించింది. నాన్న "బాబూ!" అని మెల్లిగా పిలిచారు. ఎంత మెల్లిగా అంటే ఒకవేళ నేను నిజంగా నిద్రలో వుండి వుంటే నా నిద్రకు భంగం కలగనంత మెల్లిగా.

నేను "ఊ!" అన్నాను

"ఇవాళ జగన్నాథం వాళ్ళు వస్తున్నారు!"


జగన్నాథరావుగారు.నాన్న దాదాపు ఒకేసారి సర్వీస్‌లో చేరి ఒకేసార్కి రిటైర్ అయ్యారు. రిటైరయిన తరువాత ప్రతి రోజూ ఆయన మా ఇంటికి వస్తూనే వున్నాడు ఆయన రావటంలో ప్రత్యేకత లేదు ఆ 'వాళ్ళు' రావటమే విశేషం.

"వాళ్ళు తొమ్మిది గంటల కల్లా వస్తారు. ఇప్పుడు ఏడుంబావు...."

నేనేం చిన్న పిల్లాడిని కాను. ఆ అసంపూర్తి వాక్యాన్ని అర్థం చేసుకోకపోవటానికి. అందుకనే సమాధానం చెప్పకుండా లేచి నిలబడ్డాను. నాలుగు బస్కీలు తీసి పక్కన వున్న కుర్చీలో కూలబడ్డాను.

టూత్‌బ్రష్ నా చేతిలో పెట్టి భుజం మీద తట్టేరు నాన్న రోజూ అది అలవాటైనప్పటికీ ఇప్పుడెందుకో అదోలా అనిపించింది. "థాంక్స్!" అన్నాను ఆ అనటం నాకే వెగటుగా అనిపించి సిగ్గేసింది. గిరుక్కున తిరిగి బాత్‌రూంలోకి నడిచాను.

క్రితం రాత్రి భోజనం అయిపోయాక



నేను అలవాటు ప్రకారం టేప్‌రికార్డర్ వింటూ కూర్చున్నాను నాన్న వచ్చి నా పక్కన కూర్చున్నారు నాకు ఆశ్చర్యం వేసింది— భోజనం అవగానే పడుకోవటం నాన్నకు అలవాటు.

"ఇందాక జగన్నాధం వచ్చాడు."

మామూలు విషయం ప్రత్యేకంగా చెప్పటంలో ఏదో అంతరార్థం వుందనిపించింది

"అతని యింటోకి రామారావుగారని రిటైర్డ్ హెడ్ మాస్టరు అద్దెకు దిగారుట ఆయనకు యిద్దరు ఆడపిల్లలు. ఒక మగ...."

నాకు కొంత అర్థం అయింది వెంటనే కోపం వచ్చింది. కోపం అంటే కోపం కాదు. నా నిస్సహాయతమీద నాకే కలిగిన చిరాకు అది. అందుకనే నాన్నకు నా మొహం కనబడకూడదని టేప్ రికార్డర్ ఆపే మిషతో పక్కకి తిరిగాను

"పెద్ద అమ్మాయి బి.కాం పాస్ అయి బ్యాంక్‌లో పని చేస్తున్నది. అబ్బాయి బి యస్సీ. రెండవ సంవత్సరం. చిన్నమ్మాయి టెన్త్ పెద్దమ్మాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాడుట ఆయన. నిన్ను కదల్చమని...."

"నన్నా! నాకిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు" అన్న మాటలలోకంటే అన్న విధంలో నా వ్యతిరేకత వ్యక్తం చేస్తూ అన్నాను

"మరి ఎప్పుడు చేసుకుంటావు?"

"కొన్ని రోజుల తరువాత. ఏడాదో రెండేళ్ళ తర్వాత"

నాన్న కొంచెంసేపు మాట్లాడలేదు "చూడు బాబూ! నిన్ను ఏడాదిక్రితం అడిగివుంటే యిదే సమాధానం యిచ్చేవాడివి కాదూ?" నా సమాధానం కోసం ఆగీ ఆగకుండా అన్నారు. "ఈ రెండేళ్ళు అందుకనే నేనీ ప్రసక్తి తీసుకురాలేదు. ఏ కారణం లేకుండా ఇప్పుడే వద్దు అనకు. బలమైన కారణం...."

"మన సంగతి.... అదే నా సంగతి వాళ్ళకి తెలుసా"

"తెలుసు. జగన్నాధం చెప్పాడుట. రేపు బాగుందిట. పెళ్ళి చూపులికి...."

నేను నవ్వేశాను. నాన్న బాధ పడతారని తెలిసినా నవ్వాను. "పెళ్ళి చూపులా?" అని మళ్ళీ నవ్వసాగాను. అవును మరి చూపే లేని నాకు పెళ్ళి చూపులా?

నాన్న నా నవ్వును పట్టించుకోకుండా అన్నారు. "ఎంత లాంఛనం అయితే మటుకు వాళ్ళింటికి వెళ్ళటం నాకు యిష్టం లేదు అందుకని వాళ్ళనే మన యింటికి రమ్మనమని చెప్పాను. మీ రిద్దరూ మాట్లాడుకోవచ్చు ఏమంటావు?"

ఏమనగలను? తల వూపటోయి ఆగి అన్నాను. "ఉద్యోగం మంచిదే చేస్తున్నది కదా యింతకంటే మంచి సంబంధమే దొరకలేదా?"

"ఉద్యోగం చేస్తుంటే మాత్రం దాని దారిదానిదే-కట్నం వారి కట్నందే! ఆయన ఉద్యోగం చేస్తూ ఏం వెనకేయలేదు"

నేను కళ్ళు పోగొట్టుకున్నప్పటి నుంచి పెళ్ళి మాట మరిచిపోవా లనుకునేవాడిని. పెళ్ళి చేసుకుని యింకొకర్ని బాధపెట్టడం నాకు యిషంలేదు. పైగా ఎవరో కొత్తవారి మీద ఆధారపడాలి. అంతేకాదు. చూసిన ప్రతివారు ఆ అమ్మాయికి నేను పనికట్టుకుని అన్యాయం చేశానని అనుకుంటారు.

"నేనూ పెద్దవాడిని అయిపోతున్నాను. ఓపిక తగ్గిపోతున్నది. ఎంతకాలం...." తర్వాత నాన్న ఏం మాట్లాడలేదు. మాట్లాడలేరు— తన నిశాను పొగుడుకోవటం నాన్నకి అలవాటులేదు. మాట్లాడ వక్కర్లేదు కూడా— ఎందుకంటే ఆయన చెప్పటోయినది నాకు అర్థమైంది.

నేను కాలేజీలో చేరకముందే అమ్మ చనిపోయింది నేను ఎం ఏ. పూర్తి చేసేటప్పటికి నాన్న రిటైర్ అవలేదు. సొంత యిల్లు వుంది. ఒక్కడ్నే పిల్లాడిని. దాంతో జీతం నవ్వుతూనే గడుపుతానని అనుకునే నాకు ఏ ఆటంకం రాలేదు-నాకు స్కూటర్ యాక్సిడెంట్ జరిగేంతవరకూ ఆ ప్రమాదంలో చిత్రంగా రెండు కళ్ళు పోయాయి. నా కోసమని వలంటరీగా రిటైర్ అయ్యారు నాన్న. అప్పటి నుంచి నా ఆలనా పాలనా ఆయనకు పుల్ టైం జాబ్ అయిపోయింది. నేను పెళ్ళి చేసుకుంటే ఆయనకు నిజంగా విశ్రాంతి దొరుకుతుంది. కొడుకుగా ఆయనకు నేనేం యివ్వలేకపోయినా ఆ విశ్రాంతిని కూడా దూరం చేయడంలో ఏమన్నా ఔచిత్యం వుందా? నాన్నని సుఖపెట్టటం కోసమని ఒక అమాయకురాలి గొంతు కొయ్యటం సబబా? వీటికి మధ్యేమార్గం లేదా? ఎటూ తేల్చుకోలేకపోయాను. కాని నేను 'యస్' అంటే నాన్న సంతోషిస్తారని మటుకు అర్థం అయింది.

## వేట

రసమయ జగత్తులో
మానవం మత్తుగా వుంది.
దేనికిక వెదుకులాట
విరితేనెకి(టేటి) వేట

పి. మల్లిక



ఇటీవల హైదరాబాదులో నటరాజ సాంస్కృతిక కళాసమితి. రవీంద్ర భారతిలో కుమారి సుధా పరమహంస గాన కచేరి ఏర్పాటు చేసింది. ఆ సందర్భంగా రాష్ట్ర నృత్య ఎకాడమీ అధ్యక్షులు, ఆస్థాన నాట్యాచార్యుడు శ్రీ నటరాజ రామకృష్ణ కుమారి సుధా పరమహంసకు మెమొంటో ప్రదానం చేసినప్పటి చిత్రం.

"సరే నాన్నా!" అన్నాను నాన్న వంక తిరిగి

కుర్చీ వెనక్కి తోసి లేచారు నాన్న. నా దగ్గరగా వచ్చి నా తలను తనవేపు లాక్కున్నారు. కళ్ళు లేనందుకు ఆ క్షణాన బాధపడినంతగా ఎప్పుడూ బాధపడలేదు- నాన్న మొహంలో ఎన్నో రోజుల తరువాత కనబడే సంతోషాన్ని చూడలేకపోతున్నానే అని. అయినా ఆశగా తల ఎత్తి ఆయన మొహం వేపు తిరిగాను.

"బాబూ కాఫీ!" అని నాన్న పిలవటంతో ఆలోచనలనుంచి తేరుకున్నాను. గబగబా మొహం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ గదిలోకి వచ్చాను నాన్న కాఫీ గ్లాసు చేతికి అందించారు. "కాఫీతాగి షేవ్ చేసుకుని స్నానం చేసెయ్యి".

నేను తయారయ్యి వచ్చేటప్పటికి-నాన్న మళ్ళీ వచ్చారు. టిఫిన్ స్వయంగా తినిపించారు. దాదాపుగా నాకు ఆయనే బట్టలు తొడిగారు చిన్న పిల్లాడిలా ఆయన చేత అన్ని సేవలు చేయించుకోవటం నాకు బాధ అనిపించింది. అవసరం లేకపోయినా నన్ను చేయి పట్టుకుని హాల్లోకి తీసుకు వెళ్ళారు.

"టైమెంత?"

"ఎనిమిదీ నలభై!" అని వెళ్ళిపోయారు.

నిన్న రాత్రి నుంచీ ఒక కొలిక్కిరాని సమస్యకు పరిష్కారం ఆలోచించటం

మొదలుపెట్టాను. నాన్నను యింకా ఎన్నో రోజులు అవస్థపెట్టలేను. అయితే ఈ అమ్మాయి ఎవరి బలవంతం లేకుండా, మనసు కష్టపెట్టుకోకుండా ఒప్పుకుంటే నేను సరే అనటానికి సంకోచించకూడదు అనుకున్నాను. అయితే ఆ విషయం తెలుసుకోవటం అంత తేలిక కాదు. మరి ఏం చెయ్యాలి?

నా స్ట్రాటజీ యింకా ఒక రూపు ఏర్పరుచుకోకమునుపే "వాళ్ళు" వచ్చారు. జగన్నాథంగారు పరిచయం చేశారు.

"నమస్తే!" అన్నారు రామారావుగారు.

నేను అటు తిరిగి "నమస్తే" అన్నాను. ఆయన గొంతును బట్టి మనిషి ఎలా వుంటాడో ఊహిస్తూ. మళ్ళీ జగన్నాథంగారే మాట్లాడారు. "చూడమ్మా సుశీలా! మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి. మేం ముగ్గురం ఆ గదిలో చెస్ ఆడుతుంటాం."


వాళ్ళు వెళ్ళిపోయాక నేను కూర్చున్నాను. సుశీల కూర్చుందో, లేదో తెలియదు. అయినా "మీరూ కూర్చోండి" అన్నాను. కూర్చున్న శబ్దంబట్టి నా ఊహ తప్పు కాదనుకున్నా.

"నా పేరు మహేష్."

అటునించి జవాబు రాలేదు.

"మీరు బి.కాం యిక్కడే చదివారా?"

మళ్ళీ జవాబు రాలేదు. నాకు కోపం వచ్చింది. అయినా సుశీలకి యిక్కడికి రావటం అదీ యిష్టం లేదు కాబోలు అనుకుని, కోపం దిగమింగుకున్నాను. అంతలో



"మహాప్రస్థానం" చిత్రాల ప్రదర్శనలో "మానవుడా" అన్న గేయానికి రూపకల్పన

—చిత్రకారుడు : బి. సూర్యారావు

## మినీ కవిత

'ఓర్పు' - నిన్నటి చర్యలకు
'నేడు' యిచ్చే తీర్పు
'రేపు' - నేటికి మనశ్శాంతిగా
తర్జుమాచేసే చల్లటి ఓదార్పు.

-గొల్లపూడి మారుతీరావు

ఏదో స్ఫురించగా "మీరు తల వూపితే నాకు మీ జవాబు తెలియదు. నోటితో చెప్పండి" అన్నాను.

"ఎలా తెలిసింది?" అంది సుశీల కుతూహలంగా. వెంటనే పొరపాటు గ్రహించి "సారీ" అంది.

గొంతు బాగుంది అనుకున్నాను. "సారీ ఎందుకు?" అన్నాను. "మీ దగ్గరో పావలా



కృష్ణవేణీ తరంగాలపై
పడమటి సంధ్యారాగం!

—ఫొటో : బి. వేణు, విద్యాధరపురం

కాసు, పదిపైసల బిళ్ళ వున్నాయా?" నాకెందుకో 'ఎలా తెలిసింది' అన్న సుశీల ప్రశ్నకి ఒక ట్రిక్ ద్వారా జవాబు చెబుదామనిపించింది.

"ఉన్నాయి. ఎందుకు?"

"చెబుతాను. మీ కుడి చేతిలో ఒక కాయిన్, ఎడం చేతిలో యింకో కాయిన్ వుంచుకోండి. నేను మీకో మాథమెటికల్ ఆపరేషన్ చేయమని అంటాను. మీరు ఆ గుణకారమో, కూడికో అయిపోగానే యస్ అనండి. ఇంకో ఆపరేషన్ చెబుతాను. అదీ అయిపోగానే యస్ అనండి. ఏ చేతులో ఏ కాయిన్ వుందో చెబుతాను. ఓకే?"

కొంతసేపు సంశయించి "సరే" అంది సుశీల.

"కాయిన్స్ రెడీనే కదా? మీ ఎడం చేతిలో వున్నదాని విలువని ఏడు పెట్టి గుణించండి."

"యస్."

"ఆ లబ్దానికి ఏడు కలపండి."

"యస్!"

"ఇప్పుడు మీ కుడిచేతిలో వున్న దాన్ని ఏడు పెట్టి గుణించండి."

"యస్!"

"ఆ లబ్దానికి ఏడు కలపండి."

"యస్!"

"అయితే మీ కుడిచేతిలో పదిపైసలు. ఎడంచేతిలో పావలా వున్నాయి. అవునా?"

"అవును. కాని నన్నేం ప్రశ్నలు అడగకుండా ఎలా చెప్పారు?"

నేను జవాబు చెప్పలేదు. సుశీల ఉన్నట్లుండి "అవును" అంది.

నాకేం అర్థం కాలేదు. "ఏమిటి అవును?"

"నన్నడిగారు కదా యిక్కడే చదివారా అని. దానికి జవాబు."

"బాగుంది" అని నవ్వాను. సుశీల అంత సరదాగా మాట్లాడుతుందని నేను ఊహించలేదు. నేను మెల్లగా నా చదువు, స్కూటర్ యాక్సిడెంట్, మా కుటుంబ ఆర్థిక పరిస్థితి చెప్పాను. మధ్య మధ్య సుశీల వేసిన చిన్న చిన్న ప్రశ్నల వల్ల శ్రద్ధగానే వింటోందనిపించింది.

"నేను మిమ్మల్ని యింతకు క్రితమే చూశాను."

"ఎక్కడా?" అన్నాను - నేను బయటకు వెళ్ళటం తక్కువ.

"సికింద్రాబాద్ స్టేషన్లో - ఆ రోజు లోకల్ ట్రెయిన్లోంచి మీరు దిగుతున్నారు. నేను ఎక్కే ప్రయత్నంలో వున్నాను. మీరు తూలి నామీద...."

నాకు గుర్తుకు వచ్చింది. నేను తూలి దాదాపుగా కౌగలించుకున్నట్లు పడ్డది ఈ సుశీల మీదేనన్నమాట. వెంటనే చెంప మీద కొట్టింది. అసలు విషయం తెలిశాక చేతులు పట్టుకొని మరీ క్షమాపణలు చెప్పింది. "అది రెండోసారి ఆడవాళ్ళ చేత చెంపదెబ్బ తినటం" అన్నాను.

"రెండోసారా?"

"అవును. చిన్నప్పుడోసారి అమ్మ కొట్టింది."

కిలకిలా నవ్వింది. "నిజంగా చాలా బాధపడ్డాను ఆ రోజంతా. మీకు ఎన్ని విధాల...."

"పర్వాలేదు. చేతులు పట్టుకుని కూడా.." నాకు అస్పష్టంగా గుర్తుకు రావడంతో మధ్యలో ఆగిపోయాను. "ఆ రోజు మీ

పక్కన ఉన్నతను ఎవరు ?"

సుశీల మాట్లాడలేదు.

"పొరపాటు ఒప్పుకున్నావుకదా. చేతులు పట్టుకునికూడా సారీ చెప్పాలా గుడ్డి వాడికి ? అని అన్నాడతను ?"

"అతను కృష్ణారావు అని మా కొలీగ్. మా బ్రాంచ్‌లోనే పనిచేస్తాడు" సుశీల గొంతులో ఏదో మార్పు వచ్చింది "మీకు ఈ విషయం ఎలా చెప్పాలా అనుకున్నాను ఇప్పుడా యిబ్బందిలేదు" కొంత సేపు ఆగి అంది "మేమిద్దరం పెళ్ళిచేసుకోవాలనుకున్నాం."

అంతవరకూ సుశీలతో ఒక పక్క మాట్లాడుతూనే. యింకోపక్క గాలిలో మేడలు కడుతున్నాను. సుశీల నాతో సరదాగా మాట్లాడటం నాలో ఆశలు రేపింది. ఈ ఒక్క మాటతో అవన్నీ కూలిపోయాయి

"అసలు పెళ్ళి అయిపోయిందనే అనుకున్నారు అంతా. కాని చివరిలో మేం కట్నం యివ్వలేమని ఓ MLA కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు."

"మీరు యిదంతా ఎందుకు చెబుతున్నారు ?" అనుకోకుండానే అడిగాను

"అతను నన్ను పెళ్ళి చేసుకోడు అన్న ఆలోచనే లేదు నాకు - అతనితో అంత చనువుగా తిరిగాను. అంత మాత్రాన హద్దులు మీరానని కాదు. నా పరిధి. గిరి నాకు తెలుసు. కాని యింతకుముందు జరిగినవి ఫ్రాంక్‌గా చెప్పటంలో తప్పు లేదుగా ?"

"కృష్ణారావు బాగుంటాడా?"

"అందగాడనే చెప్పాలి."

నాకు పోయిన రెండు కళ్ళు వచ్చి నన్ను నేనే అద్దంలో చూసుకుని నేను అందగాణ్ణని అనుకుంటే నన్ను ఘోరంగా వంచించుకోవటమే. "మీకీ పెళ్ళి యిష్టమేనా?"

తల వూపింది కాబోలు. వెంటనే "సారీ! నాకేం అభ్యంతరం లేదు" అంది.

"కట్నం అడగటం లేదనా?"

చాలాసేపు మాట్లాడలేదో. కొద్దిసేపే నాకు చాలాసేపు అనిపించిందో తెలియదు. తర్వాత "అవును" అంది.

"అది ఆదర్శమా ? లేక మీ ఆర్థిక పరిస్థితివల్ల అలా అంటున్నారా?" అన్నాను. "క్షమించండి మిమ్మల్ని నొప్పించాలని నా ఉద్దేశ్యం కాదు నాకీ లోపం లేకపోతే మేమూ కట్నం ఆశించేవాళ్ళమేమో. గుర్తుచేయటానికే అడిగాను. మీరీ ప్రశ్నకు జవాబు యివ్వకపోయినా పర్వాలేదు."

"ఎందుకు" అని ఎనలైజ్ చేసి చెప్పలేను గాని నాకేవిధమయిన అభ్యంతరం లేదు - అఫ్‌కోర్సు మీరూ ఒప్పుకుంటే అనుకోండి."

"నేను ఒప్పుకోనని ఎందుకనుకుంటున్నారు ?"

ఈ సారి జవాబు యివ్వటానికి చాలా సేపే తీసుకుంది. "కృష్ణారావు విషయం తెలిసాక...."

నాకు మొదటిసారిగా సుశీల పరిస్థితి అర్థం అయింది. కృష్ణారావు ఎఫైర్ మూలంగా చాలా పేరు వచ్చి వుంటాలి. నేను మాట్లాడేలోగా సుశీలే అడిగింది. "ఇంతకీ యిందాక మీరు చేసిన ట్రిక్ చెప్పలేదు"

నేను నవ్వాను "ఇందులో గొప్పేమీ లేదు. ఏడు పదులు ఎంతో గుణించటానికి పట్టే టైం. ఏడు పాతికలు ఎంతో గుణించటానికి పట్టే టైం కన్నా చాలా తక్కువ. అంటే మీరు యస్ అనటానికి తీసుకున్న సమయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే చెప్పుకోవడం ఏమంత కష్టం కాదు."

"చాలా బాగుంది" అంది సుశీల. అదే టోన్‌లో అంది : "మీరే నిర్ణయానికి వచ్చారు ఈ విషయంలో ? మీరు నిర్ణయానికి వచ్చేముందు కృష్ణారావు విషయం ఆలోచిస్తారని తెలుసు. అలాగే నేనో ప్రశ్న అడుగుతాను. ఆ ప్రశ్నను దృష్టిలో వుంచుకుని మీరు నిర్ణయానికి వస్తే సంతోషిస్తాను."

"ఏమిటా ప్రశ్న?"

"ఇప్పుడు.... మీరుకూడా.... ఎవరికైనా...." ఆగిపోయింది సుశీల. "సారీ! నేనా ప్రశ్న అడగలేను."

"అదేమిటి ?"

"అంతే! నేను ఎంతగా ఆ ప్రశ్న అడగాలనుకుంటున్నానో మీకు తెలియదు. కాని అడగలేను, కాని మీరా ప్రశ్న ఊహించటం ఏమంత కష్టంకాదు— ఊహించగలరు కూడా! మీకా ప్రశ్న ఏమిటో తెలిశాక మీ యిష్టం వచ్చిన నిర్ణయం తీసుకోండి" అంది సుశీల.

ఆ ప్రశ్న ఏమిటో నాకు అంతుపట్టలేదు.

* * *

రెండు నెలల తరువాత మా పెళ్ళి జరిగింది. నాన్న ఎంతగానో సంతోషించాడు. సుశీలకు అన్యాయం జరిగిందన్న బాధ నాకెప్పుడూ కలగలేదు— ఎందుకంటే నేను గుడ్డివాణ్ణి అన్న సంగతి పూర్తిగా మరచిపోయేట్లు చేసింది సుశీల నాచేత ఒక ట్యుటోరియల్ కాలేజీ తెరిపించింది. ఇంకా నామీద నాకే నమ్మకం పెరిగే ఎన్నో పనులు చేయించింది.

"లోపమున్న మీరు కూడా నన్ను కాదంటే యిక ఈ జన్మలో పెళ్ళవుతుందనుకుంటున్నారా ?" అన్నది. ఆ రోజున సుశీల అడగదల్చుకున్న ప్రశ్న అని నా షష్టిపూర్తి నాడు సుశీల చెప్పేంతవరకూ నాకు తెలియదు.

## జ్ఞాపకాలు

అంగటివాడు సరుకులు కట్టడానికి
పాత న్యూస్ పేపర్ చింపుతాడు
కిలో పంచదార. అర్ధ కిలో పప్పులు
పావు కిలో ఉప్పులు
చిన్నచిన్న పొట్లాలో కడతాడు
కాని జ్ఞాపకశక్తి పాత న్యూస్ పేపర్
కాదు.

చిన్నచిన్న జ్ఞాపకాలను
పొట్లాలు కట్టి దాచటానికి
మరి మనం దేనిని ఉపయోగిస్తాం
జ్ఞాపకం పెటుకోవడానికి.
ఇస్త్రీ చేసిన బట్టలమధ్య
కర్పూరపు దండలు మా అమ్మ
దాచడం నాకు బాగా జ్ఞాపకం.
నాలుగు పొట్టికాళ్ళున్న చెక్కబల్లకు
ఒక రహస్యపు సొరుగు ఉంది.
కాని దానికి తాళం లేదు.
ఆ సొరుగులో లెక్కలేనన్ని తల
పిన్నులు.
గాజులు, దారపుఉండ, దానికి గుచ్చిన
సూది.
ఆ సొరుగుకింద మరో అర
ఆ అరలో కొన్ని చిల్లర డబ్బులు
వాటిని నేను అవసరానికి దొంగిలిస్తూ
ఉండేవాన్ని.
ఇవన్నీ హఠాత్తుగా నాకు
జ్ఞాపకానికి వస్తాయి.

—కె. లక్ష్మీ పుల్లారెడ్డి